## క్లుప్తంగా

### ఆధార్ కేంద్రం ప్రారంభం



మరికల్: మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద సోమవారం తాత్కాలిక ఆధార్ కేంద్రాన్ని తహసీల్దార్ సునిత ప్రారంభించి మాట్లాడారు.. కార్యాలయంలో టోకెన్లు పొందిన వారు ఆధార్ కేంద్రానికి వెళ్లాలని సూచించారు. కొత్త కార్డులతోపాటు మార్పులు, చేర్పులు చేసుకునేందుకు 15రోజులపాటు స్థానిక రైతు వేదిక వద్ద తాత్కాలిక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీశైలం, సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ గోపాల్, ఆధార్ సిబ్బంది శ్రీను, బీంరాజ్, నాయకులు రాజేష్, రాజు, హరిష్ పాల్గొన్నారు.

### ఎస్ఐకి ఘన సన్మానం



దామరగిద్ద: మండల ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన వసంతను స్థానిక ఎంపీపీ, బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సప్ప, నాయకులు బసంత్‌రెడ్డి, రాములు, అశోక్‌గౌడ్, కన్కిరెడ్డి, నర్సప్ప పాల్గొన్నారు.

**ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డికి సన్మానం**

మక్తల్: మండల ఎస్ఐగా భాగ్యలక్ష్మిరెడ్డి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సోమవారం బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్టారెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ రవికుమార్‌యాదవ్, గోపాల్‌రెడ్డి, కావలి శ్రీహరి పాల్గొన్నారు.

### తహసీల్దార్‌కు వినతి

ధన్వాడ: మండలంలోని గున్ముక్లలో నల్ల చెరువుకు వెళ్లేరోడ్డును కొంతమంది కబ్జాచేశారని సోమవారం తహసీల్దార్‌కు గున్ముక్ల యువజన సేవసంఘం సభ్యులు ఫిర్యాదు చేశారు. చెరువుకు వెళ్లే భూమిని కబ్జా చేశారని, 358 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని సర్వేచేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని కోరారు. రాజు, వెంకట్రాములు, వెంకటేష్, తిమ్మరాజు, రాజు తదితరులు ఉన్నారు.

### సర్పంచ్ పదవీ కాలం పొడిగించాలి

నారాయణపేట: ఫిబ్రవరి 1తో ముగియనున్న సర్పంచ్‌ల పదవీ కాలాన్ని ప్రభుత్వం పొడగించాలని మాజీ ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షుడు ఎస్.రాజేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. అంతేకాకుండా సర్పంచ్‌లు చేపట్టిన వివిధ పనులకు బిల్లులు రావాల్సి ఉందన్నారు. స్పెషల్ అధికారులకు బదులుగా సర్పంచ్‌లకు పొడగింపు బాధ్యతలు అప్పగించాలని ఆయన కోరారు.

### మురుగు కాల్వల పరిశీలన



సాక్షి ఎఫెక్ట్..

మాగనూర్: మండల కేంద్రంలోని అన్ని కాలనీలోని డ్రైయినేజీల్లో ఎప్పటికప్పుడు మురుగును తొలగిస్తామని ఎంపీఓ జైపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన దోమలు బాబోయ్.. అనే వార్తకు కలెక్టర్ స్పందించి గ్రామంలోని మురుగు సమస్యపరిష్కరించి దోమలను నివారించాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా ఆలయన మండలంలోని పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యం లోపించిన పరిసర ప్రాంతాలను గమనించి వాటిని శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అన్ని కాలనీల్లో తప్పకుండా రోడ్లను ఊడ్చాలని, డ్రైయినేజీల్లో ఎప్పటికప్పుడు మురుగును తొలగించాలన్నారు.

### ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి సన్మానం

మక్తల్: మండలంలోని సంగంబండలో సోమవారం అంగన్‌వాడీ భవనం ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి సీడీపీఓ సరోజిని మట్ట, సూపర్‌వైజర్ మల్లేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, సుబాషిణీ, అంజమ్మకలిసి శాలువా పూలమాలతో సన్మానం చేశారు.



# విద్యార్థులకు కంప్యూటర్ విద్య

- స్వచ్ఛంద సంస్థచే 10కంప్యూటర్ల ఏర్పాటు
- శిక్షణ పొందుతున్న 6నుంచి 9తరగతి విద్యార్థులు
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



కంప్యూటర్ గదిని ప్రారంభిస్తున్న డీఈఓ (ఫైల్)



ఊట్కూర్‌లో కంప్యూర్ శిక్షణను పరిశీలిస్తున్న హెచ్‌ఎం సురేష్ (ఫైల్)

ఊట్కూర్: ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించాలని ప్రభుత్వం కృషిచేస్తుంది. ఒకవైపు తల్లిదండ్రులు, గ్రామస్తులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పాఠశాలలో మౌళిక వసతులతో పాటు కంప్యూటర్ విద్య, క్రీడలు తదితర అంశాలపై ఉపాధ్యాయులు శ్రద్ధవహిస్తున్నారు. మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నోబుల్ ఎడ్యూకేషనల్ సోసైటీ, సిమ్సాన్ ఫార్మ లిమిటెడ్, హైదరాబాద్ వారి సహకారంతో కంప్యూటర్ విద్యను అందిస్తున్నారు. పాఠశాలలో 6నుంచి 10వ తరగతి వరకు ఉర్దూ మిడియంలో 105మంది, తెలుగు మీడియంలో 215మంది విద్యార్థులు చదువుతున్నారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తరగతుల వారీగా శిక్షణ ఇస్తున్నారు. బ్యాచ్‌కు 20మంది విద్యార్థుల చొప్పున రెండు బ్యాచ్‌లలో 40మంది విద్యార్థులు కంప్యూటర్ విద్యను అభ్యసిస్తున్నారు. పెయింట్, వర్డ్, నోట్‌ప్యాడ్, టైపింగ్, ఎంఎస్ ఆఫీస్ వరకు శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులకు కంప్యూటర్‌లో శిక్షణ ఇచ్చేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు నెలకు రూ. 5వేల పారితోషికంతో వాలింటర్‌ను నియమించారు. చదువుతోపాటు విద్యార్థులకు కంపూటర్‌విద్య అందుతుండడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**స్వచ్ఛంద సంస్థచే ఏర్పాటు..**

నోబుల్ ఎడ్యూకేషనల్ సొసైటీ మేనేజింగ్ డైరక్టర్, పి. సత్యనారాయణరావు, గ్రామానికి చెందిన బీఎస్ఎన్ఎల్ జిల్లా రిటైర్డ్ అధికారి సునిల్ తిరుపతి సహకారంతో పాఠశాలలో సుమారు రూ. 3లక్షల 50వేల వ్యయంతో పదికంప్యూటర్లు, ఫర్నీచర్‌ను ఏర్పాటు చేశారు. గతఏడాది ఆగస్టులో డీఈఓ రవీందర్ చేతుల మీదుగా కంప్యూటర్ శిక్షణను ప్రారంభించారు. వాలీంటర్‌ను నియమించి కంప్యూటర్ శిక్షణను అందిస్తున్నారు.

### సంతోషంగా ఉంది..



ప్రైవేట్ పాఠశాలకు దీటుగా చదువుతోపాటు కంప్యూటర్ శిక్షణ పొందుతునందుకు సంతోషంగా ఉంది. తరగతుల వారీగా రోజు రెండు గంటల పాటు కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నారు. పేయింట్, నోట్‌ప్యాడ్, టైపింగ్ నేర్చుకున్నాను. కంప్యూటర్ విద్య ఉన్నతచదువులకు ఉపయోగపడుతుంది.

- మహేశ్, 8వ తరగతి, ఊట్కూర్

### ఉత్సహంగా నేర్చుకుంటున్నారు



విద్యార్థులు కంప్యూటర్ విద్యను ఉత్సహంగా నేర్చుకుంటున్నారు. గత రెండు నెలలుగా శిక్షణ ఇస్తున్నాం. రోజు బ్యాచ్‌కు 20మంది విద్యార్థుల చొప్పున రెండు బ్యాచ్‌ల వారికి శిక్షణ ఇస్తున్నాం. ప్రతి విద్యార్థికి టైపింగ్, ఎంఎస్ ఆఫీస్ పూర్తిగా నేర్పాలని ఉంది. నెలకు రూ. 5 వేలు పారితోషికం అందిస్తున్నారు.

-సోని, కంప్యూటర్ వాలీంటర్, ఊట్కూర్

### శిక్షణ ఇస్తున్నాం



పాఠశాలలో ఉర్దూమీడియం, తెలుగు మీడియంలోని ఆరో తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రతి విద్యార్థికి కంప్యూటర్‌పై శిక్షణ ఇస్తున్నాం. గ్రామస్తుల సహకారంతో స్వచ్ఛంద సంస్థ వారిచే పదికంప్యూటర్లను, ఫర్నీచర్‌ను ఏర్పాటు చేశాం. తోటి ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ప్రతి విద్యార్థికి కంప్యూర్‌పై పూర్తిస్థాయిలో శిక్షణ అందిస్తాం.

-సురేష్, హెచ్‌ఎం, బాలుర ఉన్నత పాఠశాల

## ముగిసిన ప్రీమియర్ లీగ్ పోటీలు



బహుమతి అందిస్తున్న నాయకులు కురుమన్న, రఘురామయ్యగౌడ్

నారాయణపేట రూరల్: పట్టణంలోని మినీస్టేడియం గ్రౌండ్‌లో ఆరురోజులుగా నిర్వహిస్తున్న మహంకాళి ప్రీమియర్ లీగ్ మూడో సీజన్ క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. మొదట బ్యాటింగ్‌చేసిన పవర్ హిట్లర్స్ 10ఓవర్లో 97పరుగులు లక్ష్యాన్ని నిర్దేశించగా సూపర్ సిక్సర్ జట్టు చివరి బంతి వరకు ఎంతో టెన్షన్ మధ్య విజయం సాధించారు. విన్నర్, రన్నర్‌లకు ఆర్ఎస్ఎస్ నాయకులు కురుమన్న, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామయ్యగౌడ్‌లు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని ప్రసంగాన్ని వీక్షించిన విద్యార్థులు



ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

ఊట్కూరు: మండలంలోని చిన్నపొర్ల ఉన్నత పాఠశాలలో పరీక్షాపే చర్చ అనే ప్రధాని మోదీ ప్రసంగాన్ని విద్యార్థులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా సోమవారం వీక్షించారు. ఉదయం 11గంటల సమయంలో విద్యార్థులకు భయాన్ని పోగొట్టి ఒత్తిడి తగ్గించి పరీక్షలకు సన్నద్ధం చేయాలనే ఉద్దేశంతో ప్రధాని మోదీ గంటపాటు పరీక్షా పే చర్చలో పాల్గొన్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులకు అమూల్యమైన సూచనలు అందించారు. విద్యార్థి, ఉపాధ్యాయుల మధ్య ఉత్తమ సంబంధం ఉండాలని, పరీక్షల సమయంలో భయం వీడి అనవసర ఆలోచనలు చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగన్నాథరావు, నర్సింహ, రాజేష్ పాల్గొన్నారు.

## ఇసుక అనుమతులు రద్దు చేయాలి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

మాగనూర్: మండల కేంద్రంలోని పెద్దవాగు పరివాహక ప్రాంతంలో ఇచ్చిన ఇసుక రవాణా అనుమతులు వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేస్తు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద డీవైఎఫ్ఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు.. డీటీ అమీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాలురాజు మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజల సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇసుక రవాణా అనుమతులు రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు రాఘువేంద్ర, నర్సింహులు, సాకేత్, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మానం



కోస్గిలో అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

కోస్గి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా తమ విధి నిర్వహణతో ఉత్తమ సేవా అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను తోటి ఉపాధ్యాయ బృందం సన్మానించారు. మండల పరిధిలోని మీర్జాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు వీరేందర్ గౌడ్, ఎస్జీటీ సత్యకుమార్‌లను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సిద్రాములు, భాను ప్రకాష్‌తోపాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కోస్గి: మద్దూర్ మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ కృష్ణారావు, సీనియర్ అసిస్టెంట్ నారాయణ నాయక్‌లు ఉత్తమ ఉద్యోగులుగా ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డులతోపాటు ప్రశంస పత్రాలు అందుకున్నారు. ఈ మేరకు సోమవారం ఉత్తమ ఉద్యోగులను ఎంపీటీసీలు ఏకే రాజు, సంజీవ్‌గౌడ్, అనిల్ నాయక్ సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సూపరింటెండెంట్ కొండన్నకు సన్మానించారు. గణతంత్ర్య వేడుకల సందర్భంగా ఉత్తమ సూపరింటెండెంట్‌గా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అలాగే మల్లేపల్లి పాఠశాలకు చెందిన కృష్ణ అనే ఉపాధ్యాయుడు ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడంతో ఆయనకు తపస్ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. వైస్ ఎంపీపీ ఎల్లగౌడ్, ఎంపీడీఓ రమేష్‌కుమార్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, సమరసింహారెడ్డి పాల్గొన్నారు.



మద్దూర్‌లో ఉద్యోగులను సన్మానిస్తున్న నాయకులు

### అర్హులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి



దామరగిద్ద: అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇళ్లస్థలాలు ఇవ్వాలని మండల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శిగోపాల్ అన్నారు. సోమవారం లబ్ధిదారులతో కలిసి తహసీల్దార్ నాగజ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు తీసకున్న దరఖాస్తులను వెంటనే పరిశీలించి అర్హులైన పేదలకు ఇళ్లస్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శివకుమార్, వెంకటప్ప, బుగ్గప్ప, గోవింద్ పాల్గొన్నారు .

### ఘనంగా ఉర్సు



మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్, వడ్వాట్, అడవిసత్యారం గ్రామాల్లో గోకర్ సాబ్ ఉర్సు ఉత్సవాలను ఆయా గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం గ్రామస్తులు దర్గాల వద్ద ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉర్సు ఉత్సవాలకు మండలంతో పాటు, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### కృష్ణా నుంచి ప్రారంభం..

కృష్ణా: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచందర్ రెడ్డి పాదయాత్రను కృష్ణామండలం నుంచి ప్రారంభిస్తున్నట్లు మండల కాంగ్రెస్ నాయకులు పల్లె సురేష్, కృష్ణామూర్తి తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ బుధవారం స్థానిక శ్రీ క్షీరాలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలుచేసి తన పాదయాత్రను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్రలో కాంగ్రెస్ నాయకులు, యువకులు అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

### క్రెటా కొత్త మాడల్ కారు ఆవిష్కరణ

నారాయణపేట: హ్యూందాయ్ కంపెనీ నుంచి మార్కెట్‌లోకి కొత్తగా వచ్చిన మిడ్ సైజ్ ఎస్‌యూవీ క్రెటాను జిల్లా కేంద్రంలోని హైదారాబాద్ రోడ్‌లో ట్రెండ్ హ్యూందాయ్ షోరూంలో సోమవారం ఎంవీఐలు మోహా గాంధీ, వీరస్వామి, షోరూం ఇన్‌చార్జి నవీల్ ఆవిష్కరించారు.



## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ఏఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్ : ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై దృష్టి సారించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరహరి డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తంచేసి ఏఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని, అది పునరావృతం కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నడుచుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.7800కోట్ల స్కాలర్‌షిప్పులు, ఫీజు రియాంబర్స్‌మెంట్‌లను విడుదల చేయాలన్నారు. సంక్షేమ హాస్టళ్లలో మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని కోరారు. పవన్‌కుమార్, విష్ణు, హరీష్, ఆనంద్, కవిత, శ్రావణి పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల స్థలంలో సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

కోస్గి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు సంబంధించిన స్థలాన్ని గుర్తించేందుకు సోమవారం జిల్లా సర్వే అధికారులు, స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి సర్వే నిర్వహించారు. కళాశాలకు సంబంధించి గతంలో 1665 సర్వేనంబర్‌లో 5.01 ఎకరాల స్థలం గుర్తించినప్పటికీ కేవలం 3.20ఎకరాల్లో మాత్రమే కళాశాల సముదాయం నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ కావడంతో అన్యాక్రాంతమైన పాలిటెక్నిక్ కళాశాల స్థలాన్ని గుర్తించే క్రమంలో అధికారులు సర్వే నిర్వహించారు. స్థలానికి సంబంధించి హద్దులు గుర్తించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. సర్వే డీఐ మూసా, సర్వేయర్లు అరుణ, మల్లేష్, ఆర్ఐ హర్షవర్ధన్, జూనియర్ అసిస్టెంట్ హన్మంతు, కళాశాల ప్రిన్సిపల్ పరమేశ్వరి తదితరులు ఉన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన



కోస్గిలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాసులు



దామరగిద్దలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ వసంత

కోస్గి: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని ఎస్సై శ్రీనివాసులు సూచించారు. సోమవారం పట్టణంలోని శివాజీ చౌరస్తాలో హెల్మెట్‌ధారణపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న పలువురికి జరిమానా విధించారు. అనంతరం హెల్మెట్ ఆవశ్యకతను వివరిస్తూ బాధిత వాహనదారులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నర్వ: విద్యార్థులు తమ విలువైన సమయాన్ని సెల్‌ఫోన్ మోజులో పడి సమయాన్ని వృథా చేసుకోవద్దని ఎస్ఐ కురుమయ్య అన్నారు. సోమవారం మండలంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోలీస్ కళాజాత బృందంచే అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండి, విద్యార్థులు చదువుపై శ్రద్ధకనబర్చాలన్నారు. మహిళలు, బాలికలపై మానసికంగా వేదించిన, ర్యాగింగ్ చేసిన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీస్ కళాబృందం సభ్యులు సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, రుఖ్యానాయక్, కల్యాణి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దామరగిద్ద: సమాజంలో బాలబాలికలపై జరిగే అఘాయిత్యాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వసంత అన్నారు. సోమవారం మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె సందర్శించారు. అనంతరం విద్యార్థులకు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. చదువుకునే వయస్సులో పనులకు వెళ్లొద్దని, చిన్నతనంలో పెళ్లిళ్లు చేసుకోవడం కలిగే అనర్థాలను బాలికలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ పావని, ఏఎస్ఐ అరుణ్, ఉపాధ్యాయులు రజిత తదితరులు పాల్గొన్నారు.

నర్వ: ట్రాఫిక్ రూల్స్ సరిగ్గా పాటించని వారికి గులాబీ పువ్వు ఇచ్చి సోమవారం పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని సాయంత్రం ప్రధాన రహదారిపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారి శ్రీనివాస్

ఊట్కూరు: పదోతరగతి పరీక్షలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్ కోరారు. సోమవారం బాలికల ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పదోతరగతి విద్యార్థుల్లో పరీక్షలకు సన్నద్ధమవుతున్న తీరుపై చర్చించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో భయం వదిలి కష్టపడి చదవాలన్నారు. వందశాతం విద్యార్థులు ఉత్తీర్ణత కావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రేమకుమారీ, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మరమ్మతుకు నోచుకోని బీటీరోడ్డు



గుంతలమయంగా ముడమాల్ రోడ్డు

కృష్ణా: మండలంలోని మురహర్‌దొడ్డి, గుడెబల్లూర్, ముడమాల్ గ్రామాల మధ్యన ఉన్న బీటీరోడ్లు గతరెండు సంవత్సరాలుగా మరమ్మతులు నోచుకోక పోవడంతో ఆ రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయి. ప్రస్తుతం ఆ రోడ్లపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నట్లు ఆ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టై రోడ్డు నుంచి మురహర్‌దొడ్డి వరకు ఉన్న బీటీరోడ్డు మరమ్మతులకు గాను గత సంవత్సరం క్రితమే ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఈ రోడ్డుకు మరమ్మతుపనులు జరగడం లేదని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## నులి పురుగుల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ శరత్‌కుమార్

ఆత్మకూర్: జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆత్మకూర్, అమరచింత మండలాల హెచ్‌ఎంలకు, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల అధ్యాపకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి డాక్టర్ శరత్‌కుమార్ మాట్లాడుతూ ఫిబ్రవరి 12న, 19న ఆల్బెండజోల్ మాత్రలు ఒక ఏడాది వయస్సు నుంచి 19 ఏళ్ల వరకు విద్యార్థులకు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ భాస్కర్‌సింగ్, సీహెచ్ఓ సురేష్‌కుమార్, హెల్త్‌సూపర్‌వైజర్ సామ్రాజ్యలక్ష్మి, సురేందర్‌గౌడ్, ఆయాపాఠశాలలు, కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

### డంపింగ్ యార్డ్‌ను మార్చండి

అమరచింత: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న డంపింగ్ యార్డ్‌ను మార్చలంటూ 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు వినోద్ మాట్లాడుతూ డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్న చెత్తను నిత్యం తగలబెట్టడం ద్వారా వస్తున్న పొగతో సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహించలేక పోతున్నామని వాపోయారు. అంతే కాకుండా కుళ్లిన వ్యర్థ పదార్థాలు, కోళ్ల వ్యర్థాలు, మృతి చెందిన జంతువుల కళేబరాలను తీసుకొచ్చి వాటిలో పారబోస్తుండడంతో దుర్గంధం వస్తుందని తెలిపారు. దీంతో నిత్యం దుర్వాసనతో పాటు పొగతో సావాసం చేస్తూ రోగాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్‌కు సమీపంలో చేనేత ఉత్పత్తుల సంఘం ఉందని, అక్కడి కార్మికులు సైతం వీటిని తరలించాలని ఎన్నో పర్యాయాలు వినతులు ఇచ్చారన్నారు. అధికారులు స్పందించి త్వరగా డంపింగ్ యార్డ్‌ను తరలించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ మహ్మద్‌ఖాజా మాట్లాడుతూ డంపింగ్ యార్డును తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.